# నిశ్శబ్ద సంగీతం

ఆర్కాట
వెంకటరమణ

''ఏమండీ! రేపాదివారం! మండీకెళ్ళి మామిడికాయలు పట్రండి! ఊరగాయ పెట్టాలి! మీనాక్షమ్మగారు, మామీ అందరూ పెట్టేశారు! మనమే ఈసారి లేటు!'' అంటూ హుకుం జారి చేసి పడుకొంది కూలర్ ఆన్ చేస్తూ! మా ఆవిడ.

''హు'' అంటూ అటుతిరిగి పడుకొన్నా!

★ ★ ★

ఏనాడు లేవదు! ఏడింటిదాకా ముసుగేసి పడుకొంటుంది తను! కానీ ఆరోజు ఆదివారం! అయిదు గంటలకే లేచింది తను! మొహం కడుక్కొని కాఫీ డికాక్షన్ వేసింది! ఇంతలో కాలింగ్ బెల్! పాలపాకెట్లు తీసుకొంది! కాఫీ తాగింది! పంపులో గాలి బుస్సని! వెంటనే వెళ్ళి పైపు పట్టేసింది టబ్‌కు! స్నానం చేసి మంచినీళ్ళు నాలుగు బిందెలు పట్టింది! టిఫిన్‌కు చపాతి పిండి కలిపి పెట్టేసింది!

సరిగ్గా ఏడయ్యింది! రెండోసారి కాఫీ తాగుతూ టీవి ఆన్ చేసి సోఫాలో కూర్చొంది!

'రంగోలి' కోసం కాదు!

'జీటీవి'లో వచ్చే 'తుమ్హారేలియే' కోసం!

'జీటీవి' ఎంబ్లమ్ మ్యూజిక్ వినబడేటప్పటికి పిల్లలు లేచారు!

కసకసమని బ్రష్‌తో తోమేశాడు పళ్ళని మాపెద్దాడు! శ్రీకాంత్!

రెండోది, ఆఖరిది మహాగడుగ్గాయి! నిద్రకళ్ళతోనే వచ్చి తల్లి పక్కన కూర్చుంది!

'బ్రష్' అంటు కేకేసింది!


''మమ్మీ'' అంటూ కీచుగొంతు! నిద్రమత్తుతోనే!

''సర్లే! ఇవ్వాళయినా తొందరగా లేవవుగదా! ఫో! పోయి ముఖం కడుక్కొ రా'' అంటూ తల్లి గదమాయించింది. కొంచెం పేస్టు కింద పడింది! కొంచెం బ్రష్ పై!

తొందరగా బ్రష్ చేసుకొని (?) మొహం మీద చన్నీళ్ళు పోసుకుంది! అలాగే నీళ్ళ మొహంతో వచ్చి సోఫాలో కూర్చుంది! తల్లిపక్కన! 'టవల్ కనపట్లేదు!'

తల్లి చెంగుతో మొహం తుడుచుకొంది!

ఆనందంగా ముగ్గురూ టీవీలో లీన



మయ్యారు!

బజారు నుంచి వచ్చాను! రెండు చేతుల్లో రెండు బ్యాగులు! బ్యాగులు నిండా ఊరగాయ మామిడికాయలు! మండీలో అయితే పొద్దున్న మంచివి వస్తాయి! కొద్దిగా చవక అని, అదీకాక హోంమినిస్టర్ హుకుం! తప్పుతుందా! మంచివి ఏరి ఓ వందకాయలు తెచ్చా! దూరం నించి సైకిల్ తొక్కుకుంటూ వచ్చానేమో! ఆయాసంగా వుంది! పొద్దున్నించీ కాఫీ తాగలేదు! ఎండాకాలం! సూర్యుడు అప్పుడే చురుక్కుమని పిస్తున్నాడు! దాహం! విపరీతమయిన దాహం! చైర్లో కూర్చొన్నా! 'హమయ్య' అనిపించింది! ప్రాణానికి!

ఒక్కక్షణం మా ఆవిడ, పిల్లలు నన్నుచూసి మళ్ళీ అటువైపు చూపుతిప్పారు!

'నీళ్ళ' ని సైగజేసా!

మా ఆవిడ వినిపించుకోలే!

పిల్లలు ఇద్దరూ తన్మయత్వంతో చూస్తున్నారు!

కేకవేశా!

ఊహూ! ఎవ్వరూ తమ దృష్టి మరల్చకుండా చూస్తున్నారు!

ఇహ లాభం లేదు! అనుకుంటూ నేనే లేచి వెళ్ళి ఫ్రిజ్ డోర్ తెరిచి సీసా ఎత్తి గట గటమని త్రాగేశా! చల్లటి నీళ్ళు! హమ్మయ్య అనిపించింది!

'దీదీ తేరా... దేవర్ దీవానా' అంటూ పాట వస్తోంది జీటివిలో!

కాస్త డికాక్షన్, పాలు కలుపుని పంచదార వేసుకొని కాఫీ వేడి చేస్కొన్నా!

గ్లాసులో పోసుకుని తాగుదాము అనుకుంటూండగా

పద్మనాభరావు! మా నాన్నగారి ఫ్రెండ్, ''హలో! సుబ్బారావు!'' అంటూ వచ్చాడు!

పద్మనాభరావు మానాన్నగారి బెస్ట్ ఫ్రెండ్! రిటైర్డ్ హెడ్ క్లర్క్! ఆరుగురు అమ్మాయిలు! అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి! ఇంట్లో టీవి లేదు! 'అదృష్టవంతుడు' అనుకొంటుంటాను! మా ఇంట్లో కలర్ టీవీ! ఆదివారం ఆదివారం వచ్చి, కాస్సేపు మమ్మల్ని పలకరించి, 'రంగోలి'లో పాతపాటలు విని వెళ్ళిపోతుంటాడు!

''హు! ఈయనొహడు! పొద్దున్నే వచ్చేస్తాడు రంగోలి కోసం!'' అని మనస్సులో గొణుక్కున్నా పైకి మటుకు నవ్వు పులుముకుంటూ ''రండి! రండి!'' అంటూ ఆహ్వానించి నాకాఫీ గ్లాసులోనుంచి కొద్దిగా ఇంకో గ్లాసులో వంచి ఇవ్వబోయా!

''వద్దయ్యా'' అంటూనే పుచ్చుకొన్నాడు!

''అమ్మాయి! నీచేతి కాఫీ అమృతం'' అంటూ మా ఆవిణ్ణి మెచ్చుకొన్నాడు!

''ఒరేయ్! శ్రీకాంత్! జీటివి కట్టేసి, 'రంగోలి' పెట్టరా మంచి పాతపాటలు వస్తున్నాయి'' అన్నాడు! ఆయనకి హిందీ పాతపాటల పిచ్చి!

మావాడు 'శ్రీకాంత్' 'రాముడు మంచి బాలుడు' టైపు వెంటనే మార్చేశాడు! మా రెండోది కేక!

''హు! పాత పాటలు వద్దు! మార్చెయి! జీటివి పాటలు కావాలి'' అని సతాయించ సాగింది!

''అంకుల్ అడిగారు'' అన్నాడు అన్నయ్య!

''అంకుల్! అంకుల్!'' అంటూ మెల్లగా ముద్దుగా మాటల్లో పెట్టేసి జీటివి తిప్పేసింది!

''ఏదో ఒహటి చూడనివ్వవు కదా! నువ్వు'' అంటూ మా ఆవిడ విసుక్కుంది!

నలుగురు అత్యంత ఆనందంతో చూస్తున్నారు! ఈగోల భరించలేక బెడ్‌రూమ్‌లోకెళ్ళి హాయిగా మంచంపై నడుం వాల్చాను! పేపర్‌లోపడ్డ 'ఆయిల్ పుల్లింగ్' ప్రశ్నోత్తరాలు చదువుతున్నా! ఏమీ బుర్రకెక్కడం లేదు! పక్కవాటాలో 'రంగోలి' పాటలు!

మా ఇంట్లో 'జీటివి' హోరెత్తించే పాటలు!

వెనుక వాటాలో డెక్‌లో నుంచి 'ముక్కాబలా' పాటలు!

ఆ మూల ఇంగ్లీషు 'డిస్కో మ్యూజిక్'

ఇవన్నీకాక కొంచెం దూరంలో నుంచి మైక్‌లో 'పాప బంగారు కోడిపెట్టా!' అంటూ చిరంజీవి పాటలు!

హోరెత్తించే సంగీతం! సంగీతమా! కాదు! శబ్దాలు! విపరీతమైన శబ్దాలు! చెవులు చిల్లులు పడే సంగీతం! భరించలేని శబ్దకాలుష్యం! ఇన్ని సంగీత స్వరాలను 'చెవి' జీర్ణించుకోలేక పోతోంది!

ఇంతలో 'ఠప్'మని కరెంటు కట్! మాటీవి మూగవోయింది! మాటీవినేంటి అందరి వాటాల్లోను టివి, టేపురికార్డర్, డెక్‌లు అన్నీ మూగపోయాయి!

ప్రశాంతత ఆవరించింది! ఒక్కసారిగా! 'హబ్బ' బతికా! బాబు' అనుకున్నా! చదువుతున్నదేదీ ఇంతవరకు అర్థం కావట్లేదు! ఇప్పుడు కాస్త ప్రశాంతంగా చదవొచ్చునను కుంటే! ''ఏవోయి! సుబ్బారావు! న్యూసేంటి'' అంటూ వచ్చి నేచదువుతున్న పేపర్ తీసికెళ్ళిపోయాడు పద్మనాభరావు!

''ఛ! ఛ! సాయంకాలం కట్ చేశాడు! అర్ధరాత్రి తీసాడు! మళ్ళీ ఇప్పుడు తీసాడు! అసలు ఆదివారం టీవి చూసేవాళ్ళంటే వాడికి కడుపుమంట! కావోసు!'' అంటూ మా ఆవిడ కరెంటుకోతపై శాపనార్థాలు!

''హు! ప్చ్!'' అంటూ పెద్దాడి నిట్టూర్పులు!

''ఆ! జంగిల్ బుక్! జంగిల్ బుక్'' అంటూ చిన్నది ఏడుపు!

''ఎందుకేడుస్తావ్? 'చంద్రకాంత'కు ఇస్తాడు'' అంటూ వాళ్ళన్నయ్య వూరడింపు

'చంద్రకాంత' గుర్తొచ్చింది! మా హోమ్ మినిస్టర్ అర్జంటుగా గ్యాస్ వెలిగించింది! కుక్కర్లో అన్నం పడేసింది! పాన్‌లో పప్పు పడేసింది! కూరగాయలు కసకస తరిగేసింది!

పిల్లలిద్దరికీ తలంటు పోసింది! కుక్కర్ విజిల్ వచ్చింది! దింపేసింది!

హడావుడిగా వంట ముగించేసింది! ఇంతా అయ్యేటప్పటికి సమయం ఎనిమిదిన్నర యింది! అప్పుడు నా మొహాన ఇన్ని కాఫీనీళ్ళు పడేసింది! అదీ మా మాన్నగారి ఫ్రెండ్ ''అమ్మాయి! మీ ఇంట్లో కాఫీ తాగితే మరిహ ఎక్కడా తాగబుద్ధికాదు'' అన్న మెచ్చుకోలుకు పొంగిపోయి ఆయనకు ఓ కప్పు, నాకోకప్పు!

తనూ గబగబా స్నానం ముగించింది! టిఫిన్ మొదలెట్టింది! కలిపి పెట్టిన చపాతి పిండిని ఫ్రిజ్‌లో దాచేసింది! చపాతీలు చేస్తుంటే సీరియల్ ఎక్కడ మిస్సవుతానోనని! నాల్గు వుల్లిపాయలు తరిగి, స్పీడుగా జీడిపప్పేసి ఉప్మా దించేసింది!

''మమ్మీ! ఆకలి!'' అంటూ కూతురు గారాలు పోడం మొదలెట్టింది!

''ఇదిగో! రెడీ'' అంటూ ఉప్మా దింపే లోపల

---

## అదేకావాలి

ప్రేయసీ ప్రియులు హోటల్‌కెళ్ళారు. ''నీకేం కావాలి'' అన్నాడు ప్రియుడు ప్రేయసితో.

''నీకేది కావాలో అదే'' అంది.

ప్రియుడు సర్వర్‌ను పిలిచి ''రెండు ప్లేట్లు గులాబ్‌జాం, రెండు విజిటబుల్ బిర్యానీ'' అన్నాడు.

''నాకూ అవే పత్రా'' అందా ప్రేయసి సిగ్గులొలకపోస్తూ!

- పి. రాధిక (హంపసాగర)

---

''మమ్మీ కరెంటొచ్చింది! టైం తొమ్మిద యింది!''

''వస్తాన్నా'' అంటూ నాల్గు పేట్లల్లో ఉప్మా సర్దింది! గెస్టుకో ప్లేటిచ్చింది! అందరికీ సర్ది తను నిదానంగా వచ్చి కూర్చుంది! సోఫాపై!

మళ్ళీ 'కట్'

''అబ్బబ్బా! ఈ కరెంట్ కట్‌తో చచ్చిపో తున్నాం. మంచి మంచి సీరియల్స్ అన్నీ మిస్సయిపోతున్నాం'' అంటూ మా ఆవిడ సణుగుడు!

''చంద్రకాంత లాస్టు సండేకి, ఈ సండేకి ఏమవుతుందో'' మా వాడి ఆదుర్దా!

సమయం తొమ్మిదిగంటల ఇరవై అయిదు నిముషాలయింది!

''కరెంట్ వచ్చిందేమో చూడరా!''

''లేదు మమ్మీ!''

''మనకు పోయిందా లేకా అందరికీ పోయిందా. కనుక్కో''

''లేదు మమ్మీ! అందరికీ పోయింది.''

చిన్నదానికి అసహనం పెట్రేగిపోతోంది! కాలుకాలిన పిల్లిలా లోపలా బైటా తిరుగు తోంది! సీరియల్ మిస్సయిపోతోందే అని!

పిల్లలిద్దరూ మొహం చిట్లించుకుంటూ కూర్చున్నారు!

'వెధవ కరెంటు! వెధవ కరెంటు! ఎప్పుడు చూసినా కట్' అంటూ కరెంటు వాడ్ని తిట్టుకొంటూ మామిడికాయలు, నీళ్ళల్లో వేసి కడగడం మొదలుపెట్టింది!

ఇంతసేపు ఈవిడ లీలలు, సణుగుళ్ళు చూసి నవ్వొస్తుంది! నవ్వాపుకోలేకపోతున్నా! నవ్వితే ఇంకేమయినా ఉందా! ఇహ ఆరోజుకు ఫస్తే! ఏది ఏమయినా ఈ గంటన్నర హాయిగా ప్రశాంతంగా వుంది! కరెంటు కట్‌తో 'ఎలక్ట్రా నిక్స్' అన్నీ కాసేపు మౌనం వహించాయి!

హాయిగా వుంది! ప్రాణానికి ప్రశాంతంగా వుంది! ధ్వని కాలుష్యం లేదు! శబ్దకాలుష్యం లేదు! హోరెత్తించే సంగీతం లేదు! పాప్ మ్యూజిక్ లేదు! ఏమీ లేదు! ఎంతో ప్రశాంతత! చెవులు హాయిగా నిశ్శబ్ద సంగీతాన్ని ఆస్వాదిస్తున్నాయి! ఎంతహాయిగా వుందో ఈ సంగీతం! దిమ్మెరపోయిన చెవులు హాయిగా ప్రకృతిలోని సంగీతాన్ని వింటు న్నాయి! అప్పుడప్పుడు పెదవి విరుపులు, శాపనార్థాలు వున్నా!

సమయం పావుతక్కువ పదయింది! కరెంటు వచ్చింది! టీవి ఆన్!

చంద్రకాంత సీరియల్ వస్తోంది!

పిల్లలిద్దరూ పరుగెత్తి వచ్చేశారు!

ఎక్కడి పనక్కడ వదిలేసి టీవి ముందు హాజరు!

సీరియల్‌ని తదేక దీక్షతో చూస్తున్నారు నల్గురు! రెప్పవేస్తే ఎక్కడ మిస్సవుతామోనని! చదువుతున్న పేపర్ పక్కన పడేసి మా గెస్టు కూడా సీరియల్‌లో లీనమయ్యారు!

మళ్ళీ హోరు శబ్దం! చంద్రకాంత సీరియల్, ఆప్ కి ఆదాలత్, ముక్కాబలా, ఇంగ్లీషు పాప్ మ్యూజిక్, అన్ని ఎలక్ట్రానిక్ సాధనాలు మానవుడి 'చెవి' అనే చిన్న జీవిపై తమ యుద్ధాన్ని ప్రకటించాయి!

నిశ్శబ్ద సంగీతాన్ని గ్రోలిన నా చెవులు కాస్సేపు మొరాయించాయి, ఈ శబ్దానికి. కాని తప్పదు! తప్పదు!! తప్పదు!! ఈ శబ్దకాలుష్యం! భరించక తప్పదు.

★